వనం..మనం.. మనఊరి కోసం

RNI/APTEL/26/A3829

ప్రభ మనం

TELUGU DAILY

తెలుగు డైలీ

Gmail: prabhamanam@gmail.com





విలేకరులు కావలెను.

WANTED... WANTED...

ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సి ఇంచార్జీలు,సిసి ఇంచార్జీలు మరియు మండల విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

ఎడిటర్: వి. లింగమూర్తి


9000367833, 8074937223



కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 39 పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com శనివారం 27-06-2026


# వెనెజువెలాకు భారత్ భారీ సాయం

'ఆపరేషన్ అమిస్తాద్' ప్రారంభం



- ★ఐఏఎఫ్‌కు చెందిన రెండు సీ-17 విమానాల్లో వైద్య సామగ్రి
- ★భీష్మ క్యూబ్‌లు, మందులు, 35 టన్నుల సహాయ సామగ్రి
- ★బయలుదేరిన 41 మంది వైద్య బృందం
- ★235కు చేరిన మృతుల సంఖ్య

వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అండగా నిలిచింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక - మిగతా 2 లో

# రాముడి పేరుతో మోసం సహించేది లేదు



- ❄రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్పందించిన యోగి ఆదిత్యనాథ్
- ❄ఈ కేసులో జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని స్పష్టీకరణ
- ❄సిట్ నివేదిక అందిన వెంటనే చర్యలు చేపట్టామని వెల్లడి
- ❄ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక
- ❄విపక్షాలపైనా యోగి విమర్శలు

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసంతో చెలగాటం - మిగతా 2 లో

## 27 రోజుల జైలు నిర్బంధం తర్వాత



- కేటీఆర్‌ను కలిసిన బాల్క సుమన్
- సింగరేణిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసు
- చంచల్‌గూడ జైల్లో 27 రోజులు ఉన్న బాల్క సుమన్
- బాల్క సుమన్‌కు ధైర్యం చెప్పిన కేటీఆర్

దాదాపు నెల రోజుల పాటు జైల్లో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ - మిగతా 2 లో

## విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపాటు



- ➢అయోధ్య రామ జన్మభూమి విరాళాల సేకరణలో రూ. 200 కోట్ల అవినీతి జరిగింది: ఎంపీ చామల
- ➢యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవికి రాజీనామా చేయాలని చామల డిమాండ్
- ➢మమత, ఠాకరేలకు చెందిన ఎంపీలను ఈ సొమ్ముతోనే కొనుగోలు చేశారని ఆరోపణ

అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల సేకరణలో ఏకంగా రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ చామల - మిగతా 2 లో

# శైలజా రామయ్యర్‌కు స్థాన చలనం

- ▶▶తెలంగాణలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు
- ▶▶తెలంగాణలో మరోసారి అధికారుల పునర్వ్యవస్థీకరణ జరిగింది
- ▶▶పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీ చేపట్టింది
- ▶▶13 ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది
- ▶▶ఎవరెవరికి ఎక్కడ పోస్టింగ్‌లు వచ్చాయో వివరాలు ఇలా ఉన్నాయి.




పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం మరోసారి అధికారులకు స్థాన చలనం కల్పించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మారిన రోజే ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన శాఖలకు సంబంధించిన అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మారిన తర్వాత మరోసారి అధికారుల మార్పులు చేర్పులు జరిగాయి. 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ జరగ్గా ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**దేవాదాయ శాఖ నుంచి బదిలీ**

తెలంగాణలో ఐఏఎస్ అధికారుల భారీ బదిలీలు జరిగాయి. 13 మంది ఐఏఎస్ అధికారులకు

## భారత్‌కు జపాన్ ప్రధాని జూలై 1 నుంచి పర్యటన



- జూలై 1 నుంచి 3 వరకు భారత్‌లో పర్యటించనున్న జపాన్ ప్రధాని
- ప్రధాని మోదీతో కలిసి 16వ వార్షిక సదస్సులో పాల్గొననున్న సనాయే తకాయిచి
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, సాంకేతికతపై చర్చలు

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో

## అయోధ్య విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం



- రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తు ముమ్మరం
- ఇప్పటికే ఎనిమిది మంది అరెస్ట్ చేసిన పోలీసులు
- ట్రస్ట్ చీఫ్ చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామా
- నిందితుల్లో చంపత్‌రాయ్ డ్రైవర్ రామశంకర్ యాదవ్

రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తు కొనసాగుతున్న వేళ

# 755 కోట్లతో బంగారు ఉంగరాల పథకం

- ▶▶తమిళనాడు ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందన
- ▶▶తమిళనాడులో 'తైమామన్ తంగ మోదిరం' అనే కొత్త పథకం ప్రారంభం
- ▶▶ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు 1 గ్రాము బంగారు ఉంగరం బహూకరణ
- ▶▶ఏటా రూ. 755 కోట్ల వ్యయంతో 4.42 లక్షల మందికి లబ్ధి
- ▶▶పథకంపై ప్రజారోగ్య నిపుణుల నుంచి విమర్శలు, సూచనలు
- ▶▶సీఎం విజయ్ పుట్టినరోజు నుంచి జన్మించిన శిశువులకు ఈ పథకం వర్తింపు




తమిళనాడు ప్రభుత్వం ఒక వినూత్న సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన ప్రతి శిశువుకు 1 గ్రాము బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందించనున్నట్లు ప్రకటించింది. తమిళ

## రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు

బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



- ➢రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు
- ➢'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్
- ➢రాహుల్ టూర్ల ఖర్చుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కమలదళం
- ➢రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా

## విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి

ఉపాధ్యాయులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం



- ❖సింగపూర్ యాత్రకు వెళ్లిన 37 మంది టీచర్లతో మంత్రి లోకేశ్ భేటీ
- ❖విద్యా వ్యవస్థలో మార్పునకు ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలని పిలుపు
- ❖మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు గుర్తింపు ఇస్తామని హామీ
- ❖అందరం కలిసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' సాధిద్దామన్న లోకేశ్

రాష్ట్ర విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలని,

## జగన్ బంగీ జంప్ ఆ విషయం అడుగుతానన్న కేటీఆర్



- ★జగన్ బంగీ జంప్‌పై కేటీఆర్ సరదా వ్యాఖ్యలు
- ★బంగీ జంప్ అంటే తనకు భయమని వెల్లడి
- ★కలిసినప్పుడు జగన్‌ను అడుగుతానన్న కేటీఆర్
- ★కేసీఆర్ మౌనాన్ని గోడకు వేలాడుతున్న తుపాకీతో పోల్చిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి చేసిన

# మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇదే!

- ▶▶మార్కాపురం జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- ▶▶వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- ▶▶ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ, వారితో సమావేశం
- ▶▶గిద్దలూరులో సంజీవిని ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ▶▶సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం (జూన్ 2) మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కీలకమైన వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించడంతో

# శైలజా రామయ్యర్‌కు స్థాన చలనం

మొదటిపేజీ తరువాయి - కొత్త పోస్టింగులు ప్రభుత్వం ఇచ్చింది. జీఓ ఆర్‌టీ నంబర్ 914ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్ శ్రీధర్ నియమితులవగా.. దేవాదాయ శాఖ నుంచి ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖకు శైలజా రామయ్యర్ బదిలీ అయ్యారు. ఇక పొలిటికల్ జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా అహ్మద్ నదీమ్ పోస్టింగ్ లభించింది.

### రాహుల్ బొజ్జాకు స్థాన చలనం

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జా నియామకం కాగా.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా అజిత్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. టీజీఆర్‌ఈడీసీఓ వీసీ, ఎండీగా ముష్రఫ్ అలీ ఫారూఖీకి అదనపు బాధ్యతలు అప్పగించింది. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ స్పెషల్ సీఎస్‌గా పి. కాత్యాయిని దేవి నియమితులవగా.. టీజీఆర్‌ఈఆర్‌ఏ ఈడీ కె. గంగాధర్‌కు ఆర్ అండ్ బీ శాఖలో పోస్టింగ్ లభించింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా టి. వెంకన్న బదిలీ కాగా.. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్ నియామకం అయ్యారు. హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కే. చంద్రకళకు ఎఫ్ఏసీ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది.

### అదనపు బాధ్యతలు

మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శిగా ఎం. రఘునందన్ రావుకు పూర్తి అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించగా.. టీజీ ట్రాన్స్‌కో వీసీ,ఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీకి ఎఫ్ఏసీ బాధ్యతలు ప్రభుత్వం ఇచ్చింది. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా విద్యాసాగర్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళకు హెచ్ఎండీఏలో ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చింది. కొత్త ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నియమితులైన సంజయ్ జాజుకి అదనపు బాధ్యతల కొనసాగింపుపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలు సంజయ్ జాజుకే సీఎస్‌గా అవకాశం ఇచ్చింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ అదనపు బాధ్యతలు కొనసాగించింది. ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈఓగా కూడా సంజయ్ జాజు కొనసాగనున్నారు. స్పీడ్ వ్యవస్థ బాధ్యతలు కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్దే ఉన్నాయి.

# భారత్‌కు జపాన్ ప్రధాని జూలై 1 నుంచి పర్యటన

మొదటిపేజీ తరువాయి - చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు జపాన్ ప్రధాన సనాయే తకాయిచి జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న 16వ భారత్-జపాన్ వార్షిక సదస్సులో ఇరు దేశాల ప్రధానులు పాల్గొంటారు. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాయే తకాయిచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. వాస్తవానికి, ఈశాన్య రాష్ట్రాల్లో జపాన్ చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు చిహ్నంగా ఈ సదస్సును గౌహతిలో నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, ప్రధాని తకాయిచి పర్యటన షెడ్యూల్ మరియు ఇతర లాజిస్టికల్ కారణాల రీత్యా వేదికను ఢిల్లీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు. గత ఏడాది టోక్యోలో జరిగిన 15వ సదస్సుకు కొనసాగింపుగా ఈ సమావేశం జరగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత మరియు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వం వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై నేతలు చర్చించనున్నారు. ముఖ్యంగా ఆర్థిక భద్రత, కీలక ఖనిజాలు, ఇంధన సరఫరా వ్యవస్థల బలోపేతం మరియు రక్షణ రంగ సహకారం వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉండే అవకాశం ఉంది.

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు

మొదటిపేజీ తరువాయి - లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉధృతం చేసింది. ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలనని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, "రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి" అని స్పష్టం చేశారు.

## వెనెజువెలాకు భారత్ భారీ సాయం

మొదటిపేజీ తరువాయి - బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల్లో వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందులు, ఇతర సహాయ సామగ్రిని పంపింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. వెనెజువెలా ప్రజలకు ఈ క్లిష్ట సమయంలో భారత్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉన్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. విదేశాంగ శాఖ అందించిన సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రి కూడా వెంట తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య మైత్రి ప్రాజెక్టు కింద రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా పంపించారు. ఇవి విపత్తుల సమయంలో తాత్కాలిక ఆసుపత్రులుగా ఉపయోగపడే ఆధునిక వైద్య యూనిట్లు. వెనెజువెలాలో బుధవారం నిమిషం వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందారు. 1,500 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. రాజధాని కరాకస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సాయాన్ని ప్రకటించాయి.

## రాముడి పేరుతో మోసం సహించేది లేదు

మొదటిపేజీ తరువాయి - ఆడేవారిపై జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని యోగి తెలిపారు. "అయోధ్య విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ముందే చెప్పాం. విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై కూడా యోగి తీవ్ర విమర్శలు చేశారు. "ఒకప్పుడు శ్రీరాముడు లేడని చెప్పినవారే ఇప్పుడు భక్తి గురించి మాట్లాడుతున్నారు. రామమందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో పోరాడినవాళ్లే ఇప్పుడు విశ్వాసం గురించి మాట్లాడటం విచిత్రం" అని వ్యాఖ్యానించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ విరాళాల నగదు నిర్వహణ, ఉద్యోగుల నియామకాలు, సీసీటీవీ పర్యవేక్షణ, బంగారం, వెండి వంటి కానుకల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## తుంగభద్ర జలాలు: రేవంత్ సర్కార్‌పై రాంచందర్ రావు ఫైర్

**తుంగభద్ర నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలన్న బీజేపీ**

**తెలంగాణకు రావాల్సిన నీటిలో భారీగా కోత పడుతోందన్న రామచందర్ రావు**

**సర్ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల మీద విమర్శ**



తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనివ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించారో వివరాలను బహిర్గతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర డ్యామ్‌కు ఇటీవల 33 కొత్త స్పిల్‌వే గేట్లను అమర్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ హాజరయ్యారు. గేట్ల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని రామచంద్రరావు సూచించారు. రెండు కీలక ప్రాజెక్టుల కింద తెలంగాణకు 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ సంతకం చేశారని ఆయన ఆరోపించారు. 'సర్' ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఐడీ కార్డు ఉంటేనే 'ఎస్ఐఆర్' చెల్లుతుందా? పాస్‌పోర్ట్ చెల్లదా? అని ఒవైసీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. పాస్‌పోర్ట్ అనేది ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని, అది పౌరసత్వానికి నిరూపణ కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. దలైలామా వద్ద కూడా ఎల్లో పాస్‌పోర్ట్ ఉందని, అంతమాత్రాన ఆయనకు భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో గుర్తింపు కోసం 12 రకాల ధృవీకరణ పత్రాలను సమర్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## అయోధ్య విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం

మొదటిపేజీ తరువాయి - శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రస్ట్ చీఫ్ చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అరెస్టైన వారిలో నగదు లెక్కింపు సిబ్బంది, లెక్కింపు ప్రక్రియ ఇన్‌ఛార్జి, పర్యవేక్షించిన రిటైర్డ్ బ్యాంకర్‌తో పాటు చంపత్‌రాయ్ డ్రైవర్, సన్నిహితుడు రామశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ కూడా ఉన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక ఆధారంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంతరం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులపై చోరీ, నమ్మకద్రోహం, మోసం, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 755 కోట్లతో బంగారు ఉంగరాల పథకం



మొదటిపేజీ తరువాయి - సంస్కృతిలో మేనమామ సారె పెట్టే సంప్రదాయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, 'తైమామన్ తంగ మోదిరం తిట్టం' (మేనమామ బంగారు ఉంగరం పథకం) పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 755.83 కోట్లు ఖర్చు చేయనుంది. దీని ద్వారా సంవత్సరానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే దాదాపు 4.42 లక్షల మంది శిశువులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి విజయ్ పుట్టినరోజైన జూన్ 22, 2026 నుంచి జన్మించిన పిల్లలందరికీ ఈ పథకం వర్తిస్తుంది. పెరరిజ్ఞర్ అన్నా జయంతి సందర్భంగా సెప్టెంబర్ 15, 2026న ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. పారదర్శకమైన కొనుగోళ్ల కోసం వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ (టీఎన్ఎంఎస్సీ) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవలి ఎన్నికల్లో అధికార తమిళగ వెట్రి కజగం (టీవీకే) ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. దీని ద్వారా కుటుంబాలకు అండగా నిలవడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడం, సాంస్కృతిక సంప్రదాయాలను గౌరవించడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్‌కు ఈ పథకం అదనపు బలాన్ని చేకూర్చనుంది.

### నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు

ఈ పథకంపై ఆరోగ్య రంగ నిపుణులు, ప్రతిపక్షాలతో పాటు అధికార కూటమిలోని మిత్రపక్షం నుంచే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో నిధులను ఉంగరాల కోసం ఖర్చు చేయడం కంటే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి ఉపయోగించాలని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా మిత్రపక్షమైన వీసీకే పార్టీ అధినేత, ఎంపీ తోల్. తిరుమావళవన్ ఈ పథకాన్ని పునఃపరిశీలించాలని ముఖ్యమంత్రి విజయ్‌కు విజ్ఞప్తి చేశారు. 'ది హిందూ' కథనం ప్రకారం, రూ.756 కోట్లతో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి వార్డులను ఆధునీకీకరించవచ్చని, అవసరమైన సిబ్బందిని నియమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కొరత, భద్రతా కారణాల వల్లే 44% కుటుంబాలు అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. మందులు కొనుగోలు చేయాల్సిన తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ (టీఎన్ఎంఎస్సీ) ఇప్పుడు బంగారం కొనడం ఎంతవరకు సమంజసమని ఓ ప్రభుత్వ అధికారి ప్రశ్నించారు. అయితే, ఈ పథకాన్ని ప్రజారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ కె. కొలందస్వామి సమర్థించారు. దీనివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగి, ప్రైవేటు రంగంలో అధికంగా ఉన్న సిజేరియన్ల రేటు తగ్గే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం మాత్రం పథకం అమలుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించి ముందుకు సాగుతోంది. దీంతో ఈ పథకం ఉద్దేశం, ప్రాధాన్యతలపై రాష్ట్రంలో విస్తృత చర్చ జరుగుతోంది.

## విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి







మొదటిపేజీ తరువాయి - అందరూ కలిసికట్టుగా కృషి చేసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లివచ్చిన 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, సింగపూర్ పర్యటనలో తాము తెలుసుకున్న అధునాతన విద్యా విధానాలు, బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వాటిని అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను లోకేశ్ ఆసక్తిగా విన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్రే అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం తప్పకుండా గుర్తింపునిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యారంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

## జగన్ బంగీ జంప్.. ఆ విషయం అడుగుతానన్న కేటీఆర్

మొదటిపేజీ తరువాయి - సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఒక టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, గతంలో జగన్ చేసిన బంగీ జంప్ గురించి ప్రస్తావించారు. తనకు సాహసకృత్యాలంటే ఇష్టమని, భవిష్యత్తులో స్కైడైవింగ్ చేయాలని ఉందని, అయితే బంగీ జంప్ అంటే మాత్రం ఎంతో భయమని ఆయన వెల్లడించారు. కేవలం ఒకే తాడుపై ఆధారపడి కిందకు దూకడం చాలా భయానకంగా అనిపిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జగన్ చేసిన బంగీ జంప్ అంశాన్ని గుర్తుచేసుకుంటూ, "అది జగన్‌కు ఎలా సాధ్యమైందో నాకు అర్థం కావడం లేదు. ఆయన్ను కలిసినప్పుడు దీని గురించి తప్పకుండా అడుగుతాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్యారాచూట్ సహాయంతో చేసే స్కై డైవింగ్ కంటే బంగీ జంప్ క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే ఇంటర్వ్యూలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవలి మౌనంపై కూడా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ మౌనాన్ని "గోడకు వేలాడుతున్న తుపాకీ"తో ఆయన పోల్చారు. సమయం వచ్చినప్పుడు అది తప్పకుండా గర్జిస్తుందని, ప్రస్తుతం ఆయన మార్గదర్శకత్వంలోనే తామంతా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రతి సందర్భంలోనూ నాయకుడు ముందుండాల్సిన అవసరం లేదని, అసలైన నాయకుడు వెనుక ఉండి నడిపిస్తారని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇదే!

మొదటిపేజీ తరువాయి - పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 9:55 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం చంద్రబాబు, 10:45 గంటలకు మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో కొద్దిసేపు సమావేశమైన అనంతరం, ఉదయం 11 గంటలకు వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆయన పరిహారం చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:20 వరకు నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12:55 గంటలకు గిద్దలూరు నియోజకవర్గంలోని కిష్టంశెట్టిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన సంజీవిని ఆసుపత్రిని ప్రారంభించి, వైద్యులు, సిబ్బందితో సమావేశమవుతారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఆ తర్వాత స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో 'గార్డెన్ మీటింగ్'లో పాల్గొని అభివృద్ధి అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం 5:15 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో గుంటూరుకు తిరుగుపయనమవుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## 27 రోజుల జైలు నిర్బంధం తర్వాత

మొదటిపేజీ తరువాయి - గురువారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈరోజు ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే ఆయనను అరెస్ట్ చేశారు. ఈ కేసుల వల్ల ఆయన ఏకంగా 27 రోజుల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా... తన జైలు అనుభవాలు, తదుపరి న్యాయపోరాటం గురించి చర్చించారు. ఈ కష్టకాలంలో పార్టీ తనకు అండగా నిలిచినందుకు కేటీఆర్‌కు థాంక్స్ చెప్పారు. బాల్క సుమన్‌ను కేటీఆర్ ఆత్మీయంగా హత్తుకుని, ధైర్యం చెప్పారు.

## విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపాటు



మొదటిపేజీ తరువాయి - కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పినప్పటికీ... యూపీ సిట్ పోలీసులు ఆయన సొంత మనుషులనే అరెస్ట్ చేశారని తెలిపారు. కేవలం చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను పదవుల నుంచి తప్పించి బీజేపీ చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, దేవుడి కోసం సేకరించిన విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని చామల మండిపడ్డారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన 20 మంది ఎంపీలను, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రేకు చెందిన ఆరుగురు ఎంపీలను ఒక్కొక్కరికీ రూ. 75 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడానికి ఈ రాముడి సొమ్మునే వాడారంటూ తీవ్రస్థాయిలో ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని... ఇప్పుడు చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను కేవలం పదవుల నుంచి తప్పిస్తే సరిపోదని అన్నారు.

ప్రభ మనం TELUGU DAILY Gmail: prabhamanam@gmail.com

శనివారం 27-06-2026

# వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని సీఎంకు వినతి

రాష్ట్ర ఐక్య వాల్మీకి ఐక్య పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు.



**మంత్రాలయం జూన్ 26,మనం న్యూస్:** వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు వినతి పత్రం సమర్పించినట్లు రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లక్ష్మన్న తెలిపారు. గురువారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి విచ్చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు అందుకు స్పందించిన సీఎం, కేంద్రంతో సంప్రదించి పెండింగ్లో ఉన్న బిల్లును ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు ఏపీలో 50 లక్షల మంది వాల్మీకి బోయలు ఉన్నారని తెలిపారు. బోయలు అభివృద్ధి చెందాలంటే విద్యా ఉద్యోగ రాజకీయం సామాజికంగా అభివృద్ధి చెందాలంటే ఎస్టి జాబితాలో చేర్చాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గాపురం ఈరన్న బిజెపి ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి రవిచంద్ర పాల్గొన్నారు.

# బుట్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా



**ఎమ్మిగనూరు,ప్రభ మనం,జూన్,26:** మొహరం పండుగ సందర్భంగా ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నందవరం మండలంలోని ముగతి గ్రామం మరియు ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల గ్రామాల్లో మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయడం జరిగింది.ముగతి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షి రెడ్డి గారి అభ్యర్థన మేరకు, అలాగే కడివెళ్ల గ్రామంలో మాజీ సర్పంచ్ కృష్ణ గారు, ఉరుకుంద గౌడ్ గారు, సుదర్శన్ గౌడ్ గారి విజ్ఞప్తి మేరకు గ్రామాల్లో తాగునీటి అవసరాన్ని గుర్తించి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారు వెంటనే స్పందించారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బుట్టా రేణుక గారు బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ గారికి విషయం తెలియజేయగా, ఆయన ఆదేశాల మేరకు బుట్టా ఫౌండేషన్ ద్వారా రెండు గ్రామాల్లో మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి, మొహరం పండుగ రోజులంతా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ముగతి, కడివెళ్ల గ్రామాల ప్రజలు తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించిన శ్రీమతి బుట్టా రేణుక గారు, శ్రీ బుట్టా శివ నీలకంఠ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం సేవలందిస్తున్న బుట్టా ఫౌండేషన్ మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకుందని కొనియాడారు.మొహరం పండుగ సందర్భంగా ముందస్తుగా మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగ కార్యక్రమాలు ప్రశాంతంగా, విజయవంతంగా కొనసాగాయని గ్రామ పెద్దలు, యువత, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. బుట్టా ఫౌండేషన్ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు.


# డాక్టర్. బి. ఆర్.అంబేద్కర్ భవన నిర్మాణం,ఆర్.అండ్.బి.రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



**పెద్దకడుబూరు, జూన్,26,ప్రభ మనం,న్యూస్:** 43 వ, కార్యకర్తల సమావేశంలో భాగంగా మంత్రాలయం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో,సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిని టిడిపి రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి ఎన్.రమాకాంత్ రెడ్డి,కలిసి పెద్దకడబూరు మండల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక,అంశాలపై వినతిపత్రం సమర్పించారు. పెద్దకడబూరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం నిర్మించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. మండలంలో బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాలు ఉన్నప్పటికీ, ఎస్సీ సామాజిక వర్గానికి ప్రత్యేక కమ్యూనిటీ భవనం లేకపోవడంతో అంబేద్కర్ భవనాన్ని నిర్మించి సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, పెద్దకడబూరు నుండి కల్లుకుంట,మేకడోన,కంబలదిన్నె, బనవాసి, గ్రామాలకు వెళ్లే ఆర్.అండ్.బి.రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్కు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ రహదారులను అత్యవసరంగా మరమ్మతు చేసి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ రెండు ప్రజా ప్రయోజన అంశాలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని ఎన్. రమాకాంత్ రెడ్డి ముఖ్యమంత్రి గారిని వినతిపత్రం ద్వారా కోరారు. ముఖ్యమంత్రి సైతం సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు విడుదల కు,చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు

# నేడే తుగ్గలిలో నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం

హాజరుకానున్న జిల్లా కలెక్టర్



**తుగ్గలి, జూన్ 26 ( ప్రభ మనం న్యూస్ ):** మండల కేంద్రమైన తుగ్గలి లో శనివారం (27.06.2026) పత్తికొండ నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసిల్దార్ ఎస్ రవి తెలిపారు. తుగ్గలి లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వెనుక భాగంలో, తహసిల్దార్ కార్యాలయం పక్కన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి భూ సమస్యలు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తహసిల్దార్ రవి కోరారు.

# హనుమాపురం హైస్కూల్ భవన నిర్మాణానికి నిధులు

- ఇనాం భూమి క్లాసిఫికేషన్
- పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి నరవ శశిరేఖ వినతి



**పెదకడబూరు,జూన్, 26,ప్రభ మనం,న్యూస్:** మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో నూతన ప్రభుత్వ హైస్కూల్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు, సర్వే నెం.1184లోని 6 ఎకరాల ఇనాం భూమిని ప్రభుత్వ హైస్కూల్ నిర్మాణానికి అనువుగా క్లాసిఫికేషన్ చేసి అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని, అలాగే సర్వే నెం.380లో గత 80 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని హనుమాపురం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న విద్యా సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని ఆమె తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ హైస్కూల్ మంజూరైనప్పటికీ ప్రస్తుతం విద్యార్థులు ఇరుకైన గదుల్లో చదువుకుంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరగతి గదులు, ప్రయోగశాలలు, క్రీడా మైదానం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,ప్రహరీ గోడ వంటి మౌలిక వసతులు లేక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ముఖ్యమంత్రికి,వివరించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీ రాయచోటి రామయ్య గారు విద్యాభివృద్ధి కోసం సర్వే నెం.1184లో 6 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, ఆ భూమి ఇనాం భూమిగా నమోదై ఉండటంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేకపోతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసి భూమిని క్లాసిఫికేషన్ చేసి,హైస్కూల్ నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా, సర్వే నెం.380లో సుమారు 80 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి సామాజిక న్యాయం చేయాలని ముఖ్యమంత్రికి, నరవ శశిరేఖ విజ్ఞప్తి చేశారు.

# కేఈ కుటుంబాన్ని విమర్శించే స్థాయి శ్రీదేవమ్మకు లేదు

:-కేఈ కుటుంబాన్ని విమర్శించే స్థాయి శ్రీదేవమ్మకు లేదు

:-ఎస్వీ హయాంలో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ ప్రభుత్వ అభివృద్ధే

:-వైసీపీ హయాంలో అవినీతి,అక్రమాలే పెరిగాయి

:-చెరుకులపాడులో చర్చకు సిద్ధం: టీడీపీ నేతల సవాల్



**తుగ్గలి, జూన్ 26 ( ప్రభ మనం న్యూస్ ):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుటుంబాన్ని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు లేదని టీడీపీ నాయకులు అన్నారు. కేఈ కుటుంబంపై చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు సవాల్ విసిరారు. శుక్రవారం తుగ్గలి మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కర్నూలు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, టీడీపీ సీనియర్ నాయకులు రాతన మనోహర్ చౌదరి, ఎర్రగుడి బీసీ వెంకటస్వామి, తిరుపాల్ నాయుడు, మిద్దె వెంకటేష్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ఇటీవల ఎస్వీ సుబ్బారెడ్డి మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని చెప్పడం ద్వారా టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ఆమె స్వయంగా అంగీకరించినట్లేనని అన్నారు. అభివృద్ధికి చిరునామా తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తుగ్గలి మండలంలోని 14 గిరిజన తండాలకు తారు రోడ్లు నిర్మించామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేని పెండేకల్లు, మామిళ్లకుంట, రామకొండ తదితర గ్రామాలకు కూడా రహదారి సౌకర్యం కల్పించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ చొరవతో జొన్నగిరి వద్ద ప్రతిష్టాత్మక గోల్డ్ మైన్స్ ప్రారంభం కావడం ప్రాంత అభివృద్ధికి గొప్ప అవకాశమని అన్నారు. ఈ అభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. శ్రీదేవమ్మ ఎమ్మెల్యేగా ఉన్నది 2019 ఎన్నికల్లో మాత్రమేనని, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమె ప్రజల మద్దతు పొందలేకపోయారని అన్నారు. ఆమె ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో గ్రామాల్లో అభివృద్ధి కంటే ఫ్యాక్షన్, అవినీతి, అక్రమాలే ఎక్కువగా జరిగాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. పత్తికొండ నియోజకవర్గంలో ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అప్పా వేణుగోపాల్, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేశు, మాజీ వైస్ ఎంపీపీలు విజయభాస్కర్, చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ బర్మా విరేష్, టీడీపీ నాయకులు శివరాముడు, వల్లే వెంకటేష్, నీల మనోహర్, లక్ష్మీనారాయణ, డీలర్ తిమ్మప్ప, సోమశేఖర్, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

# సహాయం కోసం ఎదురు చూసే కళ్ళు ఉంటాయి

## తల్లిదండ్రులు లేని పిల్లలకు విద్యను అందిస్తాం

## విద్య ఈ ప్రపంచాన్ని మార్చగలిగే శక్తివంతమైన ఆయుధం





**కడప బ్యూరో జూన్ : 26,ప్రభ మనం,న్యూస్:** తల్లిదండ్రులు లేని పిల్లలను చదివిస్తామని ఆర్ బి ఎన్ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు చైర్మెన్ పాపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కడప పట్టణంలోని సుబ్బిరెడ్డి కాలేజ్ ఎదురుగా ఉన్న ఆర్ బి ఎన్ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎవరైనా తల్లిదండ్రులు లేని పిల్లలు చదువుకోవాలనుకుంటే 9060699966 కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.ఆర్ బి ఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టులో భాగంగా దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని .తల్లిదండ్రులు లేని బాలబాలికలకు విద్యా,వైద్యం కోసం ఆర్థిక సాహాయం చేస్తామన్నారు. సమాజంలోఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవాలనుకుంటే విద్య ఒక్కటే ప్రధానమైందని,అలాంటి వారికి విద్యాభ్యాసం అందించాలని భావించినట్లు అయన ఈ సందర్భంగా చెప్పారు.25-11-2017 లో ఒక మరుపురాని సంఘటన ద్వారా పుట్టిన ఆలోచన శక్తివంతమైన దయాగుణంతో తన ప్రయాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు కరుణతో మొదలైన ఒక నిరాడంబరమైన కార్యక్రమం,యువ జీవితాలను మార్చడానికి అంకితమైన ఒక లక్ష్యంగా ఎదుగుతుందన్నారు తొలి రోజుల్లో,ఆకలి మరియు ప్రాథమిక సంరక్షణ వంటి తక్షణ అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టామని అయితే,మిషన్ ఎడ్యుకేషన్ తన సేవలను కొనసాగిస్తున్న కొద్దీ, పేదరికపు చక్రాన్ని ఛేదించడానికి విద్యే అత్యంత శక్తివంతమైన సాధనమని గుర్తించామని సృష్టి చరిత్ర రచనలో దొర్లిన అచ్చు తప్పుల వలన అభం శుభం తెలియని చిన్నారుల భవిష్యత్ అక్కడితో ఆగిపోకూడదని నేటి చిన్నారులే రేపటి భవిష్యత్ వారి విద్యకోసం చేయూతను అందించాలని దాతలను కోరారు మిషన్ ఎడ్యుకేషన్ చిన్నారులకు జ్ఞానం,ఆత్మవిశ్వాసం మరియు నైపుణ్యాలను అందించి,వారిని ఉత్తమ అవకాశాలకు, ఉజ్వల భవిష్యత్ కు బాటలు వేస్తుందని విద్య కేవలం వ్యక్తిగత జీవితాలను మార్చడమే కాకుండా, కుటుంబాలను బలోపేతం చేసి, మొత్తం సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తుందని గుర్తుచేశారు ఈ రోజు నుంచి మిషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ ఆశ, అంకితభావం మరియు పరివర్తనకు చిహ్నంగా నిలుస్తోందని ఒక్కో చిన్నారి కలలను పోషిస్తూ,శాశ్వత ప్రభావాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉంటుందన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని కోరారు

# భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు





## తుంగభద్ర నది లో పీర్ల దేవుళ్లను నిమజ్జనం

**మంత్రాలయం,జూన్ 26,మనం న్యూస్ :** - నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో శుక్రవారం మొహరం వేడుకలు కులమతాలకుఅతీతంగా ఖాజా హుస్సేన్ తాత, ముల్లా సాబ్ పింగాణి ఖాజా అధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా మొహరం నెల ప్రారంభమైన రోజు నుండి అసర్ ఖానా లో కొలువైన హసన్ హుశేన్, ఇమాం ఖాశీం పీర్ల దేవుళ్లను గ్రామ ప్రజలు కులమతాలకుఅతీతంగా పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పదవ రోజు మొహరం వేడుకలు హసన్ హుశేన్, ఇమాం ఖాశీం పీర్ల దేవుళ్లను భాజభజంత్రీల మధ్య సంత మార్కెట్ మీదుగా తుంగభద్ర నది లో పీర్లను నిమజ్జనం చేశారు. అక్కడ ప్రత్యేక ఫాతేహాలు (పూజలు) చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి, టౌన్ అధ్యక్షులు వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, వట్టేప్ప నర్సింహులు, నరసింహ, రఘు, సున్నం రాఘు, సిద్దు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మల్లికార్జున అధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మురళిధర్ రెడ్డి, కానిస్టేబుల్ యల్లప్ప బందోబస్తు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని మాధవరం, మాలపల్లి, రచ్చుమరి, వగరూరు, తుంగభద్ర, రాంపురం, చిలకలడోణ, సూగురు, తిమ్మాపురం, పలు గ్రామాల్లో మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ మంత్రాలయం ఎస్సై మల్లికార్జున, మాధవరం ఎస్సై విజయ కుమార్ అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## గ్యాస్ సిలిండర్లు వాడేవారికి కేంద్రం
## కొత్త రూల్స్ 30 రోజులు మాత్రమే టైమ్..



ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు వాడేవారికి కేంద్రం కొత్త రూల్స్ విధించింది. గతంలో ఉన్న నిబంధనలను సవరించింది. దీంతో గ్యాస్ వినియోగదారులకు మరింత ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా గ్యాస్ సిలిండర్ల ధరలను కేంద్రం పెంచింది. ఈ క్రమంలో కొత్త రూల్స్ ఏంటో చూద్దాం. మీరు ఇంట్లో గ్యాస్ సిలిండర్ వాడుతున్నారా..? అయితే మీకో అలర్ట్. కేంద్ర ప్రభుత్వం పలు కొత్త నిబంధనలను తాజాగా అమల్లోకి తెచ్చింది. మీరు ఇంట్లో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ వాడుతుంటే.. కొత్త రూల్స్ గురించి ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే. పైప్డ్ నేచురల్ గ్య?స్(పీఎన్‌జీ+) కనెక్షన్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు తప్పనిసరిగా పీఎన్జీలోకి మారాలని, ఎల్పీజీ కనెక్షన్‌ను వదులుకోవాలని గతంలో కేంద్రం కండీషన్ విధించింది. గ్యాస్ ఏజెన్సీలు అలాంటివారి కనెక్షన్లను రద్దు చేయాలని కూడా సూచించింది. కొంతమంది పీఎన్జీతో పాటు ఎల్పీజీ సిలిండర్ల కనెక్షన్లు కూడా కలిగి ఉన్నారు. వీరి కనెక్షన్లను వెంటనే రద్దు చేయాలని ఆదేశించింది. ఇప్పుడు ఆ రూల్స్‌లో కేంద్రం పలు సండలింపులు ఇచ్చింది. అవేంటి అనేది ఇప్పుడు చూద్దాం.

**30 రోజుల డెడ్ లైన్**

మారిన సవరణల ప్రకారం.. మీరు ఒకవేళ ఎల్పీజీ కనెక్షన్ కలిగి ఉండి కొత్తగా పీఎన్జీ కనెక్షన్ తీసుకుంటే 30 రోజుల గడువు ఉంటుంది. 30 రోజుల్లోగా ఎల్పీజీ కనెక్షన్ సరెండర్ చేయాల్సి ఉంటుంది. అయితే మీరు ఆ తర్వాత మళ్లీ పీఎన్‌జీ సదుపాయాలు అందుబాటులో లేని ఏరియాలోకి మారినప్పుడు ట్రాన్స్‌ఫర్ వౌచర్ ఇస్తారు. దీని ద్వారా మీరు వెంటనే ఎల్పీజీ కనెక్షన్ పొందవచ్చు. ఈ మేరకు కొత్త నిబంధనలను కేంద్రం తీసుకొచ్చింది.

**పీఎన్‌జీ కనెక్షన్ వల్ల లాభాలు..?**

ఎల్పీజీ సిలిండర్ పదే పదే రీఫిల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత డెలివరీ కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. డెలివరీ బాయ్ వచ్చినప్పుడు ఇంటి దగ్గర లేకపోతే ఇబ్బంది అవుతుంది. అంతేకాకుండా గ్యాస్ డెలివరీకి వారం రోజుల సమయం పడుతుంది. కానీ పీఎన్‌జీ కనెక్షన్ తీసుకోవడం వల్ల అలాంటి ఇబ్బంది ఉండదు. నిరంతరం గ్యాస్ అందుబాటులో ఉంటుంది ఇక ఎల్పీజీ సిలిండర్లలో గ్యాస్ నిండుగా నింపారా లేదా అనే అనుమానం ఉంటుంది. చెక్ చేసుకోవడం అనేది శ్రమతో కూడుకున్న పని. అదే పీఎన్‌జీలో ఆ సమస్య ఉండదు ఇక పీఎన్‌జీ కనెక్షన్ తీసుకుంటే ముందుగానే డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. మీటర్ ప్రకారం బిల్లింగ్ జరుగుతుంది. అంటే మీరు వాడుకున్న గ్యాస్‌కు అనుగుణంగా బిల్ వేస్తారు. దీని వల్ల గ్యాస్ దొంగతనానికి ఆస్కారం అనేది ఉండదు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి డబ్బులు చెల్లించే సౌకర్యం ఉంది. ఇక పీఎన్‌జీ వాడితే మసి, బూడిద, జిడ్డు మరకలు వంటి సమస్యలు కూడా ఉండవు. అలాగే పీఎన్జీ అనేది అత్యంత సురక్షితమైనది. లీకేజీ జరిగినప్పుడు పెద్దగా ప్రమాదం ఉండదు. వెంటిలేషన్ ఉంటే పలుచటి గాలిలో కలిసిపోతుంది. అదే ఎల్పీజీ బరువుగా ఉండటం వల్ల నేత ఉపరితలం వద్ద పేరుకుపోతుంది.

## తెలంగాణకు కేంద్రం భారీ శుభవార్త రాష్ట్రంలో
## మెగా రైల్వే కారిడార్ గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది..



తెలంగాణకు మరో శుభవార్త. రాష్ట్రంలో మరో కొత్త రైల్వే లైన్ పట్టాలెక్కనుంది. ఈ మేరకు డీపీఆర్ ఆమోదం కోసం కేంద్రానికి పంపారు. గ్రీన్ సిగ్నల్ లభించాక పనులు మొదలుకానున్నాయి. ఐదేళ్లల్లో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి వివరాలు చూస్తే.. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మరో మెగా కొత్త రైల్వే కారిడార్ ప్రకటించింది. రామగుండం-మనుగూరు మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మించనుంది. ఈ మేరకు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నూతన రైల్వే లైన్ 200 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. దీని నిర్మాణానికి దాదాపు రూ.5 వేల కోట్లు అవసరమవుతాయని రైల్వేశాఖ అంచనా వేసింది. బొగ్గు, సిమెంట్, ఖనిజాలు, ఇతర లోహాలతో పాటు ఆహార ధాన్యాలు, కోక్ వంటి సరుకు రవాణాకూ ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని రైల్వేశాఖ అంచనా వేసింది. ఇది పూర్తై అందుబాటులోకి వస్తే దాదాపు ప్రతీ ఏటా రూ.460 కోట్ల ఆదాయం రైల్వేశాఖకు వచ్చే అవకాశముంటుందని తెలిపింది.

**ఆదాయం ఎంత ఆదాయమంటే..?**

ఇక ఏటా 12 మిలియన్ టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చుని. దీని ద్వారా ఆదాయం రూ.720 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం ఎప్పుడో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైల్వేలశాఖ కూడా అలైన్‌మెంట్ సర్వే, డీపీఆర్ పనులు పూర్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు పనులపై కేంద్రానికి పలుమార్లు వినతులు పంపింది. త్వరగా పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో త్వరలోనే పనులు మొదలుపెట్టేందుకు రైల్వేశాఖ సిద్దమవుతోంది. ఈ నూతన కారిడార్ వల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణాకు ప్రత్యక్ష కనెక్టివిటీ ఏర్పడనుంది. దీని వల్ల దాదాపు 150 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుందని రైల్వేశాఖ చెబుతోంది. డీపీఆర్ ఇప్పటికే కేంద్రానికి సమర్పించగా.. త్వరలోనే ఆమెదం పొందే అవకాశముంది. అనంతరం ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా రవాణా వ్యవస్థకు కూడా ఉతమిస్తుంది.

**పెరగనున్న కనెక్టివిటీ**

ప్రస్తుతం కొత్తగూడెం నుంచి రామగుండం మధ్య బొగ్గు రవాణాకు డొర్నకల్, వరంగల్, రామగుండం సెక్షన్ మార్గం ఉపయోగిస్తున్నారు. అయితే ఈ కొత్త రైల్వే లైన్ వల్ల 150 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీని వల్ల బొగ్గు రవాణాకు అయ్యే ఖర్చు కూడా భారీగా తగ్గుతుంది. మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చాక ఏడాదిలోగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఇక సురుకు రవాణాతో పాటు ప్రయాణికులకు కూడా ఇది ఉపయోగపడనుంది. ఒడిశా, ఢిల్లీ, చత్తీస్ గఢ్ వైపు వెళ్లే రైళ్లు భద్రాద్రి కొత్తగూడెం మీదుగా ప్రయాణించవచ్చు. దీని వల్ల దూరం తగ్గనుంది.

## కిరాణా సామాన్ కోసం సూపర్ మార్కెట్ వెళ్తున్నారా..
## ఇలా చేస్తే మీ బిల్ సగానికి సగం తగ్గుతుంది..



సూపర్‌మార్కెట్ ఆఫర్ల మాయలో పడి అనవసరంగా డబ్బులు వేస్ట్ చేస్తున్నారా? కొన్న వస్తువులు వాడకుండా ఫ్రిజ్‌లోనే కుళ్లిపోతున్నాయా? అయితే మీ షాపింగ్ స్టైల్ మార్చాల్సిన టైమ్ వచ్చేసింది. ప్లానింగ్ లేకుండా చేసే షాపింగ్ వల్ల ఇటు ఆహారం వృథా అవ్వడమే కాకుండా, అటు నెలవారీ బడ్జెట్ కూడా తలకిందులవుతోంది. మీ జేబుకు చిల్లు పడకుండా ఇలా చేయండి.. మనలో చాలామందికి ఒక అలవాటు ఉంటుంది.. కేవలం రెండు వస్తువులు కొందామని సూపర్‌మార్కెట్‌కు వెళ్తాం.. కానీ తిరిగి వచ్చేటప్పుడు చేతిలో ఒక పెద్ద ట్రాలీ నిండా సామాన్లు ఉంటాయి. ఆఫర్లు చూసో, ముచ్చటపడో అవసరం లేని సాస్‌లు, కూరగాయలు కొనేసి.. ఆ తర్వాత వాటిని వాడటం మర్చిపోయి ఫ్రిజ్‌లోనే కుళ్లిపోయేలా చేస్తుంటాం. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 130 కోట్ల టన్నుల ఆహారం ఇలాగే వృథా అవుతోంది. ఈ వృథాను అరికడుతూనే, మీ బడ్జెట్ దాటకుండా స్మార్ట్‌గా గ్రోసరీ షాపింగ్ చేయడానికి ఉపయోగపడే 7 అద్భుతమైన టిప్స్ ఇవే..

**లిస్ట్ తయారు చేసుకోండి**

చాలామందికి లిస్ట్‌లు రాయడం బోర్ కొట్టే విషయమే, కానీ ఇది వృథా ఖర్చులను ఆపడంలో ఒక మ్యాజిక్‌లా పనిచేస్తుంది. ఇంట్లో ఏమేం వస్తువులు అయిపోవచ్చాయో ఒక నోట్‌ప్యాడ్‌లో రాసుకోండి. వీలైతే త్వరగా పాడైపోయేవి, ఎక్కువ రోజులు నిల్వ ఉండేవి విడివిడిగా లిస్ట్ రాసి, షాపింగ్‌కు వెళ్లినప్పుడు ఆ లిస్ట్‌కు మాత్రమే కట్టుబడి ఉండండి.

**ఆఫర్ల మాయలో పడకండి**

డిస్కౌంట్ వస్తోంది కదా అని ఒకేసారి ఆరు సబ్బులు లేదా ఐదు కిలోల పిండి అవసరమా? అని ఆలోచించండి. ఆఫర్ల కోసం కొనేసి, ఆ తర్వాత వాడకుండా పక్కన పడేస్తే డబ్బుతో పాటు వస్తువు కూడా వేస్ట్. కూరగాయలు, పండ్లను వారానికి ఒకసారి.. డ్రై ప్రొడక్ట్స్, పప్పు దినుసులను నెలకు ఒకసారి మాత్రమే అవసరమైన మేర కొనుగోలు చేయండి.

**నిల్వ ఉంచే నియమాలు పాటించండి**

ప్రతి వస్తువు ప్యాకింగ్‌పై దాన్ని ఎలా నిల్వ చేయాలో రాసి ఉంటుంది. ఆ సూచనలను ఖచ్చితంగా పాటించండి. ఉదాహరణకు.. బ్రెడ్ ఎక్కువ రోజులు బయట ఉంటే పాడవుతుంది. ఇంట్లో తినేవారు తక్కువ మంది ఉంటే చిన్న బ్రెడ్ ప్యాకెట్ కొనండి. మిగిలితే ఒకటి లేదా రెండు రోజులు ఫ్రిజ్‌లో పెట్టి, తినే ముందు టోస్టర్‌లో వేడి చేసుకోండి.

**కొత్త వస్తువులైతే చిన్న శాంపిల్స్ కొనండి**

మార్కెట్లోకి కొత్తగా వచ్చిన చీజ్, సాస్‌లు లేదా కొత్త బ్రాండ్ ప్రొడక్ట్స్‌ను ట్రై చేయాలనుకుంటే.. మొదట అందులో దొరికే అత్యంత చిన్న సైజ్ ప్యాకెట్‌ను మాత్రమే కొనండి. అది మీకు నచ్చి, మీ డైట్‌కు సెట్ అవుతుందనుకుంటేనే తర్వాత పెద్ద ప్యాకెట్ కొనడం వల్ల అనవసరపు ఖర్చులు తగ్గుతాయి.

**మంచి డీల్స్ ఎంచుకోండి**

మనం రెగ్యులర్‌గా వాడే మసాలాలు, తృణధాన్యాలు, ఫ్లోర్ క్లీనర్స్ వంటి వస్తువులపై బై వన్ గెట్ వన్ ఆఫర్లు ఉన్నప్పుడు కొనుగోలు చేయడం మంచి పద్ధతి.

## చిట్టీలు వేస్తున్నారా..? ఇలా చేస్తే మీకు
## లాభమే లాభమే చాలామందికి తెలియని విషయమిదే..



ఇటీవల చిట్ ఫండ్స్‌లో ఎక్కువమంది పెట్టుబడులు పెడుతున్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు ఎన్నో చిట్టీ గ్రూపులు నడుస్తున్నాయి. అయితే కొంతమందికి వీటిపై తప్పుడు అభిప్రాయం ఉంది. మోసాలు ఎక్కువగా చోటుచేసుకుంటుండటంతో పొదుపు చేయాలంటేనే భయపడిపోతారు. కానీ వీటి వల్ల లాభాలు కూడా ఉన్నాయి. నగరాల నుంచి గ్రామాల వరకు.. ఎక్కడబట్టినా చిట్టీల గురించి మీరు వినే ఉంటారు. ఇటీవల ఆన్‌లైన్‌లో చిట్టీలు వేసే విధంగా అనేక డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ కూడా వచ్చాయి. ఫ్రెండ్స్, కుటుంబసభ్యులు, సన్నిహితులు ఒక సుమూహంగా ఏర్పడి చిట్టీలు వేస్తూ ఉంటారు. ఇదే కాకుండా అనేక చిట్ ఫండ్ కంపెనీలు కూడా పుట్టుకొస్తున్నాయి. నెలనెలా చిన్న మొత్తంలో డబ్బులు పొదుపు చేసుకునేందుకు చాలామంది చిట్టీలలో చేరుతూ ఉంటారు. ఇక మరికొంతమంది అవసరానికి డబ్బులు ఒకేసారి సమకూరుతాయనే ఉద్దేశంతో వీటిల్లో చేరతారు. ఇటీవల చిట్టీల ద్వారా డబ్బులు పొదుపు చేసేవారు, అలాగే డబ్బును లోన్ రూపంలో తీసుకునే లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయి. చిట్టీలపై చాలామందికి అనేక అనుమానాలు ఉంటున్నాయి. కొంతమంది చిట్టీల రూపంలో డబ్బులు కలెక్ట్ చేసిన తర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇలాంటి మోసాల వల్ల చిట్టీలపై ప్రజల్లో చాలా భయాలున్నాయి. అసలు చిట్టీల వల్ల లాభాలేంటి..? నష్టాలేంటి..? వీటిల్లో చేరడం మంచిదేనా? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

**చిట్ ఫండ్స్ అంటే ఏంటి..?**

కొంతమంది ఒక గ్రూపుగా కలిసి నిర్వహించేదే చిట్ ఫండ్. గ్రూపు సభ్యులందరూ జమ చేయగా వచ్చిన డబ్బును గ్రూపులోని ఒక వ్యక్తిగా లోన్ రూపంలో అందిస్తారు. ముందుగానే ఎవరు తీసుకోవాలనేది ఫిక్స్ అవుతారు. ఎక్కువ పోటీ ఉంటే బిడ్డింగ్ నిర్వహిస్తారు. లోన్ తీసుకున్న వ్యక్తి తర్వాతి నెల నుంచి వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. చివరి వరకు చిట్టీలో కొనసాగినవారికి వడ్డీ రూపంలో అదనంగా డబ్బు లభిస్తుంది. మొదట్లో డబ్బులు తీసుకునేవారు అదనంగా కట్టాల్సి రావడం వల్ల నష్టం జరుగుతుంది. అదే చివరి వరకు ఉండేవారికి లాభమే. కానీ డబ్బులు అత్యవసరం కావడంతో చాలామంది మధ్యలోనే లోన్ రూపంలో తీసుకుంటారు. ఇలాంటి వారికి నష్టమేనని చెప్పవచ్చు. కానీ అత్యవసంర కావడంతో డబ్బులు తీసుకుంటారు. బ్యాంకుల్లో లోన్ తీసుకోవాలంటే సిబిల్ స్కోర్, డాక్యుమెంటేషన్ ప్రాసెస్ ఉంటుంది. అదే చిట్ ఫండ్స్‌లో అలాంటి ఏమీ ఉండవు.

**లాభాలు ఇవే..**

అత్యవసరమైన సమయంలో డబ్బు వెంటనే చేతికి అందుతుంది

బయట తీసుకునే లోన్లతో పోలిస్తే చిట్టీలలో వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది

నెలనెలా డబ్బులు చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకోవచ్చు

ఎలాంటి డాక్యుమెంటేషన్ ఉండదు

నష్టాలు ఏంటంటే..?

గ్రూపులోని సభ్యుడు డబ్బులు కట్టకపోతే అందరిపై ప్రభావం పడుతుంది

అనధికార, రిజిస్టర్ కాని సంస్థల వల్ల చిట్టీ వేస్తే మోసపోయే అవకాశముంటుంది

మధ్యలో డబ్బులు తీసుకుంటే తర్వాతి నెల నుంచి అదనంగా వడ్డీ చెల్లించాలి

## తుగ్గలిలో ఘనంగా
# మొహారం వేడుకలు

### భక్తిశ్రద్ధలతో పీర్ల స్వాములకు మొక్కులు చెల్లించిన భక్తులు
### మొహరం కోసం సొంత ఊర్లకు చేరుకున్న ప్రవాసులు









**తుగ్గలి, జూన్ 26 ( ప్రభ మనం న్యూస్):** మండల కేంద్రమైన తుగ్గలి లో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య పీర్ల పండుగను గ్రామ ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకున్నారు. మొహరం వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తుగ్గలి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా తమ సొంత ఊరికి చేరుకున్నారు. గ్రామంలోని పీర్ల చవిడి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పీర్ల స్వాములను దర్శించుకున్న భక్తులు తమ మొక్కులను భక్తితో తీర్చుకున్నారు. కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. మొహరం సందర్భంగా యువకులు ఉత్సాహంగా పాల్గొని చావుసోన్ కార్యక్రమాలను నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో పీర్లను ఊరేగిస్తూ భక్తి భావాన్ని చాటారు. డప్పు వాయిద్యాలు, భక్తుల నినాదాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ట్రైన్ టికెట్లపై చిన్న రంధ్రాలు ఎందుకుంటాయి..? హవ్వా అసలు సీక్రెట్ ఇదా..









మీరు పాత రోజుల్లో ట్రైన్ టికెట్ చూస్తే.. టికెట్‌పై రెండు వైపులా చిన్న చిన్న రంధ్రాలు ఉంటాయి. అయితే కాగితంపై ఈ రెండు రంధ్రాలు ఎందుకు అనే డౌట్ ప్రతీఒక్కరికీ వచ్చే ఉంటుంది. అయితే ఈ రంధ్రాల వెనుక పెద్ద కారణమే ఉందట.

ప్రతీఒక్కరూ ఎప్పుడో ఒకసారి రైళ్లల్లో ప్రయాణం చేసి ఉంటారు. కౌంటర్ దగ్గరకు వెళ్లి లైన్లో నిల్చోని టికెట్ తీసుకుని ఉండి ఉంటారు. అయితే ట్రైన్ టికెట్‌కి సంబంధించి చాలా ఆసక్తికర విషయాలు ఉన్నాయి. టికెట్‌పై ఛార్జీ, ఎక్కడ నుంచి ఎక్కడి వరకు అనేవి ముద్రించి ఉంటాయి. అయితే పాత రోజుల్లో టికెట్‌కు రెండు వైపులా చివరిలో చిన్న రంధ్రాలు ఉండేవి. అసలు ఆ రంధ్రాలు ఎందుకు ఉన్నాయి? అనే అనుమానం చాలామందికి వచ్చి ఉంటుంది. దానికి సమాధానాలు ఇప్పుడు చూద్దాం

**1 / 5**

రైలు టికెట్‌పై ఉండే చిన్న రంధ్రాలను చూసి అలంకరణ కోసమో లేదా ఆకర్షణీయమైన డిజైన్ కోసం అని చాలామంది అనుకుంటారు. కానీ దీని వెనుక పెద్ద సీక్రెట్ ఉంది. ఒక పెద్ద సాంకేతిక కారణం ఉంది. పాత రోజుల్లో టెక్నాలజీ, కంప్యూటర్లు, ప్రింటర్లు అంతగా అందుబాటులో ఉండేవి కాదు. దీంతో రైలు టికెట్లను ముద్రించేందుకు ప్రత్యేక యంత్రాలను ఉపయోగించేవారు. ఈ యంత్రాల కారణంగానే ఈ చిన్న రంధ్రాలు అవసరమయ్యాయి.

**2 / 5**

వీటిని స్ప్రోకెట్ రంధ్రాలుగా పిలుస్తారు. అప్పట్లో డాట్ మ్యాట్రిక్స్ ప్రింట్లను రైల్వేశాఖ ఉపయోగించేది. టికెట్ల జారీ కోసం వీటిని అభివృద్ధి చేశారు. పాత రోజుల్లో టికెట్లను వేర్వేరు పేజీలుగా కాకుండా పొడవైన కాగితంపై ముద్రించేవారు. ప్రింటర్ కాగితాన్ని సరిగ్గా పట్టుకుని ముందుకు కదిలించడానికి వీలుగా ఇరువైపులా రంధ్రాలను కాగితానికి సమాన దూరంలో ఉంచేవారు.

**3 / 5**

పాత డాట్ మ్యాట్రిక్స్ ప్రింటర్లు పూర్తిగా యాంత్రికమైనవి. వాటి లోపల చిన్న పళ్ళ చక్రాలు ఉండేవి. ఈ చక్రాలు కాగితం అంచులలోని రంధ్రాలలోకి సరిపోయి కాగితాన్ని ముందుకు లాగేవి. ఈ చిన్న రంధ్రాలు లేకపోతే కాగితం జారిపోయి వంకరగా అయ్యేది. అలా జరిగితే టికెట్‌పై ముద్రించిన సమాచారం సరైన స్థానంలో కాకుండా తప్పుగా ఉండేది. స్ప్రాకెట్ రంధ్రాల కారణంగా కాగితం సరళ రేఖలో కదలడమే కాకుండా ప్రతి టికెట్ సరిగ్గా ముద్రించబడేది.

**4 / 5**

అయితే ప్రస్తుతం ఆధునిక థర్మల్, డిజిటల్ ప్రింటర్లు అందుబాటులోకి వచ్చాయి. కొత్త ప్రింటర్లకు కాగితాన్ని కదిలించేందుకు గేర్‌వీల్ వ్యవస్థ అవసరం లేదు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com